వడిగాడు వాన సిరా

చెళ్లూరి సీతా రాజేశ్వరరావు

పతంజలికి ఎంతకీ నిద్ర పట్టలేదు.

గంటకి పైగా మంచంమీద దొర్లడం వల్ల విసుగ్గా వుంది. సగం లేచి గడియారంకేసి చూశాడు. రెండయింది. శాలువా వంటినిండా కప్పుకుని వరండా లోకి వచ్చాడు. చలిగాలి వీస్తోంది.

ఆకాశం మబ్బుపట్టి వుంది. ప్రకృతి నిస్తేజంగా వుంది. వాతావరణం భారంగా వుంది. వర్షం ఏ క్షణమయినా పడవచ్చు.

పతంజలి దృష్టి గ్యారేజీవైపు పడింది. తలుపులు తీసివున్నాయి. కారు లేదు. ఎదురగా స్కూటర్ పార్క్ చేసి వుంది.

ఎవరు వచ్చారు ? ఎవరయినా వస్తే పోలయ్య చెప్పడా ?

పతంజలి మేడ దిగి వచ్చాడు. హాలు నిశ్శబ్దంగా వుంది. వంటషెడ్డు వరండాలో సుబ్బమ్మ కునికిపాట్లు

పడుతోంది. పతంజలిని చూసి భయంగా లేచి కూర్చుంది.

"పోలయ్యా!" పతంజలి పిలిచాడు.

"ఇంటి కెళ్ళాడేమోనండి" సుబ్బమ్మ సమాధానం చెప్పింది.

విద్య తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. పతంజలి తలుపులు త్రోశాడు. తోటలోకి వేళ్ళే తలుపులు బార్లా తీసివున్నాయి వరండాలోకి రాగానే మాటలు వినిపిస్తున్నాయి.

పతంజలి ప్రక్కగా ఆగిపోయాడు. తోట అంతా స్పష్టంగా కనిపిస్తోంది. విద్య సిమెంటు బెంచీమీద కూర్చుని వుంది అశోక్ సిగరెట్ కాలుస్తూ ఆమెముందు నించున్నాడు. విద్య ధరించిన గులాబీరంగు డిసి యం చీర గాలికి ఎగురుతోంది

వార్ని చూడగానే పతంజలి హృదయం భగ్గుమంది.

పెళ్ళయింది. అయినా విద్యకి బుద్ధి రాలేదు. పాత స్నేహితుడ్ని మరచిపోలేక పోతున్నది. తోటలో కూర్చుని నలుగురూ చూస్తారని కూడ లేకుండా కబుర్లు చెపుతుందా ?

"విద్యా .." పిలుద్దామని తమాయించుకున్నాడు.

తోటలోని సంభాషణం వినిపిస్తోంది స్పష్టంగా. పతంజలి ఆవేశాన్ని స్వాధీనం చేసుకుంటూ ఆగిపోయాడు.

"నీ దగ్గర్నుంచి కబురు రాగానే ఎగిరి గంతేశాను. నువ్వేమో చలిగాలిలో కూర్చొని పెట్టి మాట్లాడుతున్నావు. గదిలోకి పోదాం పద." అశోక్ భుజాల మీద తట్టి అన్నాడు ప్రక్కన కూర్చుంటూ.

విద్య దూరంగా జరిగింది.

"నీకోసం తక్కిన పనులన్నీ మానేసి వచ్చాను...... వెచ్చగా నీ కౌగిలిలో ఈ చలికాచుకుందామని" అశోక్ కళ్ళల్లో కాంక్ష కనిపిస్తోంది.

"నువ్వు వస్తావనే అనుకున్నాను."

"మునపటికంటె అందంగా వున్నావ్ విద్యా."

అశోక్ ఆమె బుగ్గలు అందుకోబోయాడు. విద్య దూరంగా జరిగింది. అశోక్ ఆమె తొడలమీద చేయి వేశాడు. ఆమెని అందుకోడానికి ముందుకు వంగాడు.

"మిస్టర్ అశోక్" గంభీరంగా అంది విద్య. "దయచేసి నువ్వు బుద్ధిగా కూర్చోవాలి ఇట్స్ మై రిక్వెస్ట్."

అశోక్ నిరాశగా కూర్చున్నాడు.

"గతాన్ని మనం మరచిపోవాలి. అనివార్య కారణాలచేత మన పెళ్ళి కాలేదు. మన దారులు విడిపోయాయి. అందుకు తగ్గట్టే మనం ప్రవర్తించాలి. నేను రాసిన ఉత్తరాలు నీ దగ్గర ఉన్నాయి. అవి నాకు అందచెయ్యి అశోక్."

"భయపడుతున్నావా విద్యా?"

"నా జాగ్రత్తకోసం," విద్య తలవంచుకుంది.

"నన్ను అంత దుర్మార్గుడిగా జమ కట్టకు విద్యా. వాటితో నీ కాపురాన్ని చెడగొట్టను. నన్ను నమ్ము. వాటిని మన పరిచయానికి గుర్తుగా దాచుకుంటాను."

భౌతికంగా యింకా గుర్తులు ఉంచుకోవడం అవసరమంటావా? కాలం ఎటువంటి చిక్కులు తెస్తుందో!" విద్య భయపడింది.

అశోక్ మాట్లాడలేదు.

"కొత్త ప్రపంచంలో ఇప్పుడే అడుగులు వేస్తున్నాను అశోక్! గతానికి సమాధిచేస్తేకాని నాకు భవిష్యత్తు లేదు." బేలగా అంది.

అశోక్ లేచాడు.

"ఆల్‌రైట్ విద్యా .... సాయంత్రం పంపిస్తాను నువ్వు భయపడేటప్పుడు అవి నాకెందుకు?"

"వీటికోసమే అన్నయ్యని చూద్దామన్న వంకతో వచ్చాను"

"మరి వస్తా...విద్యా."

"మరచిపోకు," హెచ్చరించింది.

అశోక్ స్కూటర్ కనిపించేదాకా అక్కడే వున్నది విద్య. ఇప్పుడు ఆమె మనస్సు ప్రశాంతంగా వుంది.

అర్ధరాత్రి కోనేరులా నిర్మలంగా వుంది.

మెల్లగా లోపలికి నడిచింది.



గుమ్మంలో సీరియస్‌గా తండ్రి నిలబడివున్నాడు.

విద్య తడబడింది. ప్రక్కనుంచి వెళ్ళిపోడానికి ప్రయత్నించింది పతంజలి "ఆగు" అన్నాడు గర్జిస్తూ.

"ఎవరు వస్త !"

విద్య మాట్లాడలేదు. దోషిగా పట్టుబడిపోవటం ఆమెకి చాల బాధగా వుంది. తండ్రి నిద్రపోయే టైం కదాని అశోక్‌ని పిలిపించింది. అశోక్ రావడం ఆయన చూశాడా ?

"అశోక్ కదూ ?" పతంజలి రెట్టించాడు

విద్య తలూపింది.

"పాతకథ తిరిగినడుస్తూందన్నమాట."

"అదికాదు నాన్నా......" విద్యకి కంగారువల్ల మాటలు గుర్తురాలేదు.

పతంజలి అసహ్యంగా చూశాడు : "ఈనాడు నువ్వు నా కూతురివి కాదు. మరోవ్యక్తి భార్యవి. నీపై వచ్చే కళంకానికి మేం సంజాయిషీ ఇచ్చుకోవాలి అవమానం భరించాలి. ఆ పరిస్థితి రాకుండా చెయ్యటం నీ చేతుల్లో వుంది"

విద్య తలూపింది

ఆ విషయంమీద కూతురితో ఇంకా చర్చించడం పతంజలికి యిష్టంలేదు. హాల్లోకి వచ్చేశాడు. మనస్సంతా అశాంతిగా వుంది.

ప్రొద్దుట ఉత్తరం జ్ఞప్తికి వచ్చింది.



విద్యని క్షమించాడు కూతురు కనుక. కాని తా నా ఉత్తరం రాయొచ్చా ? అది సమంజసమా ? ఒక చోట ఒక న్యాయమూ, ఇంకొక చోట మరో న్యాయమూ ఉంటుందా ?

పతంజలి గొడుగు తీసుకుని బయలుదేరాడు. పలుచగా చినుకులు పడుతున్నాయి. రోడ్డంతా గొడుగులతో నిండిపోయింది.

మూడుగంటలకి టపా బయలుదేరుతుంది. ఏమైనా ఆ ఉత్తరం వెళ్ళ కూడదు. పతంజలి వేగంగా నడిచి పోస్టాఫీసు చేరుకున్నాడు.

పోస్టుమాన్ బాక్సు తీసి ఉత్తరాల మీద ముద్రలు కొడుతున్నాడు. పతంజలిని చూసి "నమస్కారం సార్" అన్నాడు.

పతంజలి చెప్పగానే కవరు తీసి యిచ్చాడు.

"దీనికోసం మీరు రావాలా సార్!" పోస్టుమేన్ అన్నాడు.

"పోలయ్య ఎక్కడికో వెళ్ళాడు."

ఉత్తరం అందుకోగానే పతంజలికి బలం వచ్చింది. కవరు జేబులో పెట్టుకుని ఇంటికి బయలుదేరాడు.

తను నిద్రపోయివుంటే ఉత్తరం ప్రయాణం చేసివుండేది. సంసారంలో కలతలు విజృంభించేవి. అశాంతి రాజ్యమేలేది.

ఇది అందగానే శ్రీపతి గుండెలు

సెప్టెంబరు సంచికలో

టెంపోరావు గారి

బూట్ లెగ్గర్ బుచ్చయ్య

పూర్తి డిటెక్టివ్ నవల

పగిలేవి. తిరిగి వాడి ఆరోగ్యం ఖరాబయ్యేది. వాడిమీద ఆశలు పెట్టుకున్న తాము ఏమయ్యేవారు ?

ఇంటికి రాగానే వర్షం ఉధృతమైంది.

వీధి వరండాలోని పెద్ద కుర్చీలో కాళ్ళు కడుక్కుని కూర్చున్నాడు. సుబ్బమ్మ వేడి వేడి టీ తీసుకువచ్చింది.

"అమ్మాయిగారు వెళ్ళిపోతానంటున్నారు బాబూ."

"వానలో ఎక్కడికి వెళుతుంది ? కారు లేదుగా."

సుబ్బమ్మ ఏం మాట్లాడలేదు

"ప్రొద్దుటే వెళ్ళవచ్చని చెప్పు."

సుబ్బమ్మ చెప్పక్కర్లేదు. విద్య తలుపుచాటున నిలబడివుంది. తన రహస్యం తండ్రికి తెల్సిపోయాక అక్కడ ఉండబుద్ధికాలేదు ఆమెకి.

తండ్రి సీరియస్‌గా కూర్చోవడంతో, ఆయన తనను గురించే ఆలోచిస్తున్నాడని అభిప్రాయపడింది.

పతంజలి కవరు చింపి ఉత్తరాన్ని తీశాడు.

రెండు పేజీల ఉత్తరం. రగిలే గుండెలతో రాసిన ఉత్తరం. తనే న్యాయాధిపతయితే ఆ విషయాన్ని అక్కడే తేల్చేసేవాడు. కాని తన కా అధికారం లేదు.

తను కేవలం సాక్షి.

జరిగిన యదార్థాన్ని ఉత్తరంగా రాశాడు.

గమనిక

రచయిత(త్రు)లు తమ తమ రచనలు పంపేటప్పుడు కొత్త పోస్టల్ రేట్లు జూన్ 1 నుంచి అమలులోకి వచ్చినవి గుర్తుంచుకొని తగినన్ని తపాలా బిళ్లలు వేసి పంపవలసిందిగా కోరుచున్నాము.

ఎడిటర్, యువ

అది శ్రీపతికి తెలియాలి.

వాడు బాధపడ్డా తప్పదు. తెలుసుకోవాలి విషయం. ఏంచెయ్యాలో వాడే నిర్ణయించుకోవాలని ఉత్తరం రాశాడు.

వానజోరు ఎక్కువయింది. పోకచెట్లు నగ్ననృత్యం చేస్తున్నాయి. గాలికి రెండుమూడు చెట్లు గుమ్మాలకడ్డంగా పడిపోయాయి.

కారు వచ్చి ఆగింది. జయ దిగింది.

పతంజలిని చూసి పెద్దగా అడుగు లేసుకుంటూ లోపలి కెళ్ళిపోయింది.

జయ ఎక్కడి కెళ్ళింది? కేకేసి అడుగుదామనుకుని విరమించుకున్నాడు. ఉత్తరం తీసి చదివాడు.

గతం గుర్తుకు వస్తోంది.

* * *

పతంజలి క్లబ్‌నుంచి ఇంటికి వచ్చే సరికి వాసుదేవరావు వరండాలో పచార్లు చేస్తున్నాడు. పతంజలి కారు బయటే ఆపి హడావిడిగా లోపలికి వెళ్ళాడు.

"క్రిమినల్ లాయరుగారు యింటికి రాగానే స్వాగతం చెబుతున్నారే."

"కేసుకి కాదులే" వాసుదేవరావు నవ్వి ఇన్విటేషన్ తీసి ఇచ్చాడు. పతంజలి ఇన్విటేషన్ తిరగేసి "కొడుక్కి ప్రాక్టీసు అప్పగిస్తున్నా వన్నమాట, లక్కీ ఫెలో" అన్నాడు.

"అరవై దాటాక యింకా తాపత్రయం దేనికి పతంజలి. ఇది విశ్రాంతి తీసుకునే వయస్సు. ఇంకా బాధ్యతలు పెంచుకుని కష్టపడటం నా కిష్టంలేదు. అందుకే ప్రాక్టీసు మావాడికి ట్రాన్స్‌ఫర్ చేసేస్తున్నాను."

"నీ అదృష్టం అందరికీ వస్తుందా వాసూ" పతంజలి గొంతు జీరబోయింది.

వాసుదేవరావు నవ్వి కారు దగ్గరి కెళ్ళాడు. "తప్పకుండా రావాలి నువ్వు"

"ష్యూర్... డ్రింక్ తాగి వెళుదువు గాని."

"నో. థాంక్స్... ఇప్పుడేం వద్దు."

వాసుదేవరావు కారు స్టార్టుచేశాడు.

నాగరికత వెనుక, సంస్కారం లోపల మనిషి తన హీనభావాల్ని దాచేసుకున్నా ఏకాంతంగా వున్నప్పుడు అంతరాత్మ ముందు యదాతథంగా నిలబడక తప్పదు.

వాసుదేవరావూ, తానూ వృత్తిరీత్యా స్నేహితులు. లీడింగ్ లాయర్లుగా బార్‌లో పేరుంది. వాసుదేవరావు నేడు తనకి అందని సుఖానికి వారసుడవడం ఈర్ష్యగా వుంది.

ప్రాక్టీసు కొడుక్కి అప్పగిస్తున్నాడు. మరి తను?!

(ముగింపు వచ్చే సంచికలో)

Printed and Published by A. Chandra Seker Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor. A SUDHAKARA RAO

వడిగాడు వానసిరా

చెళ్లూరి సీతా రాజేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

అరవైనిండినా ఇంకా సమస్యల వలయంలో వున్నాడు. ఈ సాలెగూడు నుంచి తప్పించుకుని పారిపోయే అదృష్టం తనకి లేదు.

వాసుదేవరావులా అందివచ్చిన కొడుకున్నాడు తనకి కాని తన ప్రాక్టీసు ట్రాన్స్ఫర్ చేయ లేదు. మా ంయ్యాలి తప్పు.

శ్రీపతి రోగిష్టివాడు. వాడికి మూర్ఛల జబ్బు ఉంది. వాడి అనారోగ్యం తనకి పజిలయింది ఎంత ఖర్చు పెట్టినా రోగం తగ్గడంలేదు. ఒక్క కొడుకయి నందుకు ఏ ముచ్చటా తీరలేదు తనకి వాడివల్ల.

ఫ-క్షనకి వెళ్ళబుద్ధికాలేదు. కాని ఆ రోజు దివారమయింది. ముఖ్యమైన కేసు ఉందని చెప్పడానికి లేదు.

కారణాలు వెతుకుతున్నాడు.

శనివారం సాయంత్రం దూరపు బంధువు పోయినట్లు ఉత్తరం వచ్చింది.

ఆదివారం ఉదయం భార్యతో బయలుదేరాడు. తనంతట తాను అంత ముఖ్యంకాని పరామర్శకి భర్త బయలు దేరడం కామేశ్వరమ్మకి ఆశ్చర్యంగా వుంది.

పరామర్శ ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగివస్తూండగా మధ్యలో కారు ఆగిపోయింది. డ్రయివర్ అరగంట తంటాలుపడి "లాభంలేదండీ ...... మెకానిక్‌ని పిలిపించాలి," అన్నాడు.

"వెళ్ళి తీసుకురా."

పోలయ్య లారీ ఆపి ఎక్కాడు.

సాయంత్ర మయింది. ఎండ పూర్తిగా తగ్గిపోయింది. పతంజలి, కామేశ్వరమ్మ దగ్గర్లోవున్న పాక హోటల్లో కూర్చున్నారు.

హోటల్ చిన్నదైనా శుభ్రంగా వుంది. నాలుగువైపులా సినిమా బొమ్మలు అంటించారు. ప్రొప్రయిటర్ తారుడబ్బాలా ఉన్నాడు. పతంజలి వద్దంటున్నా వినకుండా బ్రూ కలుపుకు వచ్చాడు. పతంజలితో రాజకీయాలు ప్రారంభించాడు.

ఇదంతా కామేశ్వరమ్మకి విసుగ్గా ఉంది.

"షావుకారూ టీ చెయ్యవోయ్." ఓ యాభై ఏళ్ళ ఆసామీ లోపలికి వచ్చాడు.

"అత్యవసరపరిస్థితిని ఎత్తివేయ కూడదంటాను" షావుకారు గట్టిగా బల్లగుద్దాడు. పతంజలి ప్రోత్సాహంగా మాట్లాడటంతో విజృంభించాడు.

"షావుకారూ !" వచ్చిన ఆసామీ విసుక్కున్నాడు

"మంచి బిగిలో ఉన్నప్పుడు వద్చా వయ్యా పంతులూ......" షావుకారు గ్లాసులో పంచదార వేసి లోపలి కెళ్ళాడు.

వచ్చిన వ్యక్తిని చూపెడుతూ "సుబ్బారాయుడిలా లేడండీ ?" అంది కామేశ్వరమ్మ.

"నేను చూడేలేదు...సుబ్బారాయుడే"

పతంజలి పిలిచేలోపుగా అతడే దగ్గరికి వచ్చాడు. "మీరా బాబుగారూ... బాగున్నారా అమ్మా ?"

"ఏమిటలా అయిపోయావ్ సుబ్బయ్యా ?" కామేశ్వరమ్మ అడిగింది.

"రోజులు బాగాలేవమ్మా...ఏదో బ్రతికేస్తున్నాను." వెర్రిగా నవ్వాడు.

సుబ్బారాయుడు యిరవై యేళ్ళ పాటు పతంజలి దగ్గర గుమస్తాగా పని చేశాడు. కొడుక్కి ఉద్యోగం రాగానే మానేసి వెళ్ళిపోయాడు.

గ్యాస్ పొయ్యి యాక్సిడెంటులో కోడలు మరణించింది. ఆ షాక్‌తో కొడుకు పిచ్చివాడయ్యాడు. ఆ పిచ్చి లోనే నూతిలోకి దుమికి మరణించాడు.

సుబ్బారాయుడి జీవితం చీకటి గుహ అయిపోయింది. ఈ దండ

యాత్రలవల్ల అతడి ఆరోగ్యం దెబ్బ తింది. ఏనుగులాంటి మనిషి పీను గయ్యాడు

జరిగినదంతా తెల్సుకుని కామేశ్వరమ్మ విచారించింది. "తట్టుకోవాలి సుబ్బయ్యా ... పిరికిగా పారిపో కూడదు."

సుబ్బారాయుడు యింటికి రమ్మని కోరాడు.

"కారు వదలి రావడం ఎలా ?" అన్నాడు పతంజలి. వెళ్ళడానికి అతడికి ఇష్టంలేదు. క్రింది స్థాయి మనుషులతో సన్నిహితంగా వుండటం అతడికిష్ట ముండదు

"మీ కారు నేను చూస్తానండయ్య గారూ," అన్నాడు షావుకారు

"నడవండి ... అత సంతగా చెబు తూంటే." కామేశ్వరమ్మ లేచింది. ఆ యిరుకు హోటల్లో కూర్చోవడం మెకి నచ్చలేదు. పతంజలి అయిష్టంగా లేచాడు

మెయిన్‌రోడ్ దిగి ఎదురుగా వున్న సందులోకి దారితీశాడు సుబ్బారాయుడు. రోడ్డ తా కూలీలతో సందడిగా వుంది. కొత్తగా రోడ్డు వేస్తున్నారు. రోలర్ తిరుగుతోంది కామేశ్వరమ్మ స్థూలం మనిషి. ఈ రోడ్డుమీద నడవటం ప్రయాసగానే వుంది.

"జాగ్రత్తమ్మా ..." సుబ్బారాయుడు హెచ్చరిస్తున్నాడు.

కోవెల ప్రక్కనున్న పాతయింటికి దారితీశాడు సుబ్బారాయుడు. నీరెండలు ఆ యింటిమీద పడి మెరుస్తున్నాయి. కోవెలనుంచి గంటలు వినవస్తున్నాయి.

ఆ యిల్లు ఏ క్షణమయినా పడిపోయే టట్లు వుంది. మట్టి అరుగులనిండా దూలాలు, డొక్కలు వున్నాయి. గోడలు నల్లబడి వున్నాయి.

ఇంటి ముందు ఒత్తుగా గడ్డి మొలిచి వుంది.

"జయా!" సుబ్బారాయుడు తలుపు కొట్టాడు.

ఇందులో ఎలా కాపురం చేస్తున్నారా అనిపించింది పతంజలికి.

ఇరవైయేళ్ళ అమ్మాయి తలుపు తీసింది. కొత్తవాళ్ళని పోల్చుకోడానికి ప్రయత్నించింది. సుబ్బారాయుడు పెరట్లో జామచెట్టు క్రింద మంచం వాల్చాడు.

"కాఫీ పెట్టమ్మా..." కూతుర్ని ఆదేశించాడు.

కామేశ్వరమ్మ వారిస్తూ "ఇప్పుడు కాఫీ ఎందుకయ్యా...అలాంటి ప్రయత్నాలు చెయ్యకు జయా" అంది.

"మా యింటికి వచ్చి ఏమీ తీసుకోరా ఏమిటి? ... కారు బాగయ్యేసరికి ఏ టయిమవుతుందో...కనీసం భోజనమైనా చేసి వెళ్ళాలి."

"ఆ పిల్లని శ్రమపెట్టడం ఎందుకయ్యా" అన్నాడు పతంజలి. సంసారం



పరిస్థితి చూడగానే తెలుస్తోంది. ఇటువంటి దశలో మర్యాద కోసం అతిథుల్ని భరించడం మాటలా!

"శ్రమేముందండీ..." కూతుర్ని వండమన్నట్లుచూశాడుసుబ్బారాయుడు.

కామేశ్వరమ్మకూడా జయతోలోపలికి వెళ్ళింది.

పతంజలి మంచంమీద మోచేతుల మీద పడుకని "మరిప్పుడేం చేస్తున్నావ్? అమ్మాయి పెళ్ళి చెయ్యలేదా?" అని అడిగాడు.

సుబ్బారాయుడు మంచం దగ్గరగా తులసమ్మ గట్టుమీద కూర్చున్నాడు. ప్లీడరుగారు తన యోగక్షేమాలు అడగటం అతడికి సంతోషం వేసింది. "ఏం చెయ్యమంటారు చెప్పండి? గట్టిగా పనిచేస్తే మంచం ఎక్కవలసి వస్తోంది ఇంటిదగ్గరే కూర్చుని నాలుగు ప్రయివేట్లు చెప్పుకుంటున్నాను. వూరు మంచిది కనుక ఏదో జరిగిపోతున్నది. ఇక జయ పెళ్ళంటారా? అది నా చేతుల్లోలేదు. రూపాయలుపోసి దానికి మొగుణ్ణి కొనలేను."

పతంజలి మాట్లాడలేదు. ఇంకా వాగిస్తే జయ పెళ్ళికి సాయం చెయ్యమంటాడేమోనని భయపడ్డాడు. పతంజలి డబ్బు దగ్గర చాలా లోభి. దరిద్రం నుంచి పైకి వెళ్ళాడేమో దరిద్రమంటే భయం.

ఖాతాఖానీ జరుగుతుండగా భోజనానికి పిలుపు వచ్చింది.

జయ వంట అద్భుతమని పతంజలి మెచ్చుకున్నాడు

భోజనాలవగానే పతంజలి బయలుదేరదామన్నాడు. డ్రయివరు వచ్చాడో

లేదో నని చూసివస్తానన్నాడు సుబ్బా రాయుడు.

జయ భోజనానికి కూర్చోగానే కామేశ్వరమ్మ భర్త దగ్గరకి వచ్చింది. పతంజలి పాత దీపావళి యువ చదువు తున్నాడు.

"జయని చూడగానే ఏమనిపిస్తోంది?" భర్తని అడిగింది.

"సుబ్బారాయుడి కూతురని పిస్తోంది" పతంజలి జవాబిచ్చాడు.

"నాకు మాత్రం కోడలు చేసుకోవా లనిపిస్తోంది ఎంత అణకువ, ఎంత నెమ్మది. ముత్యంలాంటి పిల్ల."

"చాలా ఆశ వుందే?"

"సుబ్బారాయుణ్ని అడగండి. కాదనడు."

"శ్రీపతికి పిల్లనిస్తాడా? వాడి రోగం సంగతి తెలియదా?"

"అన్నీ మీరే మాట్లాడతారు." కామేశ్వరమ్మ విసుక్కుంది. మన స్థాయిలో ఎవరూ యివ్వకపోవచ్చు. సుబ్బారాయుడులాంటి దరిద్రుడు కళ్ళు మూసుకుని యిస్తాడు పెళ్ళయితే కోడలు వచ్చినవేళ వాడు మనిషే అవుతాడేమో."

చివరి మాటల్లో తల్లి ఆశ స్పష్టంగా వినిపించింది.

విద్య పెళ్ళయినప్పట్నుంచి శ్రీపతి పెళ్ళి విషయం పతంజల్లో మెదులు తోంది. కాని సంబంధం వెతకడానికి సిగ్గుగా వుంది.

పెళ్ళయితే శ్రీపతి రోగం తగ్గవచ్చు నని కొంతమంది డాక్టర్లు చెప్పారు. ఆ ఆశ తనకి వుంది. అడిగితే సుబ్బారాయు డేమంటాడో?

"ఆ ముచ్చటా తీర్చుకుందాం."

కామేశ్వరమ్మ ముఖంలో ఆనందం తొంగిచూసింది.

"సుబ్బారాయుడికి ఏదయినా ఆశ చూపించండి."

"అవన్నీ నువ్వు చెప్పాలా?"

ఆడపిల్ల పెళ్ళి నిప్పుల గుండంతో మధ్యతరగతి మనిషి పోల్చుకుంటున్న పుడు వీలైనంత తొందరగా ఆ బాధ నుంచి విముక్తి కావాలని కోరుకుంటాడు.

పైవాళ్ళు అంతస్థు నిలబెట్టుకోవ డానికి, మధ్యవాడు మిధ్యా గౌరవాన్ని కాపాడుకోడానికి, క్రిందివాడు ఆకల్ని తప్పించుకోడానికి నిత్యం కాలంతో కుస్తీ పడుతూంటారు.

పతంజలి చెప్పగానే సుబ్బారాయుడు ఎగిరి గంతేశాడు "అంత అదృష్టమా మాకు" అన్నాడు. అడవిలో దారితప్పి తిరుగుతూండగా తారురోడ్డు కనిపించిన వాడిలా సంబరపడ్డాడు.

"అదృష్టం మాది." పతంజలి కొన్ని డిగ్రీలు క్రిందకి దిగిపోయాడు. కొడుకు అనారోగ్యం అహాన్ని కరిగించి వేసింది.

"..............."

"శ్రీపతి రోగిష్టివాడని నీకు తెల్సుగా

రాయుడూ... పెళ్ళయితే దారిలో పడ తాడని ఆశ. ఇందులో బలవంతం ఏమీ లేదు. అనక ఏం జరిగినా నువ్వు బాధపడకూడదు." కామేశ్వరమ్మ హెచ్చరించింది.

"అబ్బాయి బాగుపడతాడమ్మా." సుబ్బారాయుడు జోస్యం చెప్పాడు.

"అమ్మాయిని కూడా కనుక్కో." పతంజలి చెప్పాడు.

"దాని ముఖం దాన్ని అడిగే దేముందండీ?"

"అడిగి చూడవయ్యా" కామేశ్వరమ్మకి యింకా సంశయం తొలగి పోలేదు. శ్రీపతి రోగిష్టివాడని కాదంటుందేమో!

కూతుర్ని శేశేశాడు సుబ్బారాయుడు తలవని తలంపుగా కూతురు పెళ్ళి కుదరడం అతడికి ఆనందంగా వుంది. ఏ వంకా లేకపోతే పతంజలి కోరి తనతో వియ్యమొందుతాడా? అసలు తను పెళ్ళిచేసే స్థితిలో వున్నాడా? అసలే తను రోగిష్టివాడు. తను దాటి పోతే జయ బ్రతుకు ఏమవుతుంది? ఎవరాదరిస్తారు? మంచికో చెడ్డకో పెళ్ళి జరిగిపోతే చాలు. తన భారం వదులు తుంది. ఇక దాని అదృష్టమెలావుంటే అలా జరుగుతుంది.

జయ వచ్చింది ఎవరూ అడక్కుండానే ఆమెకి తెల్సిపోయింది. వీరి సంభాషణ వంటింటిలోకి వినిపిస్తోంది. కామేశ్వరమ్మ అడగ్గానే నేలచూస్తూ నించుంది.

"అదో వెర్రి మాలోకమండీ. యింత అదృష్టం వస్తూంటే ఏం చెబుతుంది?"

చివరికి యిష్టమేనని తల ఆడించింది. పల్లెటూరులో చదువులకి నాగరికతకి దూరంగా వుండే మధ్యతరగతి ఆడపిల్ల అంతకంటే ఏం చెబుతుంది.

కామేశ్వరమ్మ బాధంతా తొలగి పోయింది. మెడలోనుంచి గొలుసు తీసి కోడలి మెడలో వేసింది.

పతంజలి దంపతులు సంతోషంగా ప్రయాణమయ్యారు.

"లగ్నం చూసి రాస్తాను. మీరిద్దరూ బయలుదేరి వచ్చెయ్యండి. కారు పంపిస్తాను. పెళ్ళి గురించి మీరేం ఖర్చుపెట్టవద్దు." పతంజలి కారెక్కి చెప్పాడు.

మర్నాడు ప్రొద్దుట కాఫీ సమయంలో చెప్పింది శ్రీపతితో.

"నాకు పెళ్ళెందుకమ్మా?"

"అదేమిట్రా!"

"నా రోగానికి ఆ పిల్లకూడ బాధ పడాలా?"

"చాల్లే ... నయమవుతుంది. నాకు నమ్మకంగా వుంది."

"మన ఆశకోసం మరి ఒకర్ని బలి చేస్తావన్నమాట."

"ఈ పెళ్ళికి ఆ పిల్ల అంగీకరించింది."

"దరిద్రం అలా చేయించి వుంటుంది."

"నా కిష్టం లేదమ్మా."

"మమ్మల్ని యిలాగే ఏడిపిస్తావు మాట."

శ్రీపతి తల్లి కన్నీరు చూసి కరిగి పోయాడు.

నెలరోజుల్లో పెళ్ళి జరిగిపోయింది.

పెళ్ళి 'సమస్య'గా భావించే రెండు పక్షాలవారు నిట్టూర్పు విడిచారు. తేలిక పడ్డారు. బరువు దింపుకున్న శ్రామికుడిలా ఆనంది చారు.

పెళ్ళి జరిగిన సాయంత్రం భార్యతో తోటలో కూర్చున్నాడు శ్రీపతి. చల్లటి గాలి వీస్తున్నది. సంధ్య వెలుగులతో తోట అందంగా వుంది.

గులాబీరంగు జరీ అంచు పట్టు చీరలో జయ ముగ్గులుపెట్టిన తులసి కోటలా వుంది. పెళ్ళి అలంకరణతో ఆమె లావణ్యం భాద్రపద మాసం నదిలా నిండుగా వుంది.

జయ నడుం చుట్టూ చేతులువేసి దగ్గరకి లాక్కున్నాడు. మెత్తటి ఆమె వక్షం లోగిలి శ్రీపతి ముద్దుపెట్టు కున్నాడు.

"ఎవరయినా చూస్తారు..." జయ సిగ్గుపడి దూరంగా జరిగింది.

"చూడకపోతే ఫర్లేదా?"

జయ మందహాసం చేసింది.

పెళ్ళయినా శ్రీపతికి సందేహం పోలేదు. జయ తనని యిష్టపడి చేసుకుందా? ఎవరయినా బలవంతం చేశారా?

"ఈ పెళ్ళికి నువ్వెందుకు అంగీకరించావ్ జయా?"

జయ విస్తాకు పడింది.

"చెప్పు." ఆమె చేతుల గలగలలు వింటూ అడిగాడు.

"మీ రెందుకు అంగీకరించారు ?" జయ ఎదురు ప్రశ్నించింది.

"నన్ను బలవంతం చేశారు."

"పరిస్థితి నన్ను బలవంతం చేసింది."

"నాకున్న జబ్బు నీకు తెల్సా ?" బేలగా, భయంగా అడిగాడు.

"మీరు భయపడకండి. తగ్గిపోతుంది. అతడి వక్షం రాస్తూ ధైర్యం చెప్పింది. నిన్నటిదాకా యిద్దరూ అపరిచితులైనా, వివాహబంధం నేడు బాంధవ్యాన్ని కలిపింది. జీవితాంతం ఒకరికోసం మరొకరు, ఒకరివలన మరొకరు, ఒకరినుండి మరొకరు చీకటి వెలుగులు పంచుకోవాలి

"నీకు నమ్మకముందా ?"

జయ తలూపింది.

"శ్రీపతి ఆమె ఒడిలో తలపెట్టుకొని విశ్రాంతిగా పడుకున్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి.

పెళ్ళి జరిగిన తర్వాత ఆ వ్యక్తులలో కలిగిన మార్పు :

కామేశ్వరి : వేసవి మధ్యాహ్నం

చల్లటి పానీయం త్రాగినట్లయింది. ఇన్నాళ్ళూ కొడుకు ఆరోగ్యానికి బాధ పడుతూ సేవలుచేస్తూ వచ్చింది. జయ రావడం ఆమెకి కాస్త రిలీఫ్‌గా వుంది. శ్రీపతి కొడుకుకంటె జయ భర్తగా కనిపిస్తున్నాడు మానసికంగా ఆ భావం రావడం ఆరాటాన్ని తగ్గించింది.

పతంజలి : జయ - మనస్ఫూర్తిగా శ్రీపతికి సేవచేయడం తృప్తి నిచ్చింది. కేవలం డబ్బుకి ఆశపడిన పిల్ల తమ కుటుంబంలో కల్లోలం రేపకుండా వుంటుందా అని ముందర భయపడ్డాడు జయ ఇంట్లో పిల్లలా కలిసిపోయింది.

సుబ్బారాయుడు : "అమ్మాయి కింకా పెళ్ళి చెయ్యవూ ?" అన్న ప్రశ్న నుంచి తప్పుకున్నాడు. ప్రయత్నం లేకుండా మంచి సంబంధం కుదిరింది. ఇది జయ అదృష్టం. పతంజలి తమతో వుండమని బలవంత పెట్టినా బాగోదని తనింటికి వెళ్ళిపోయాడు. అయినా ఇదివరకులా రోజు గడుస్తుందా అనిబాధ పడక్కర్లేదు. ప్రస్తుతానికి పతంజలి దగ్గరనుంచి రెండువందలు మనియార్డరు వస్తుంది.

శ్రీపతి : చిన్నప్పటినుంచీ అనారోగ్యంవల్ల తల్లో, తండ్రో, చెల్లెలో కాపలా వుండటంవల్ల ఖైదీననే భావం మొలకెత్తింది. ఏ మార్పులేని రోజులు. బాధలు, మందులు, డాక్టర్లతో విసిగి పోయాడు. జయ రాకతో రోహిణిలో పగిలిన భూమికి తొలకరివానలా వుంది. ఈ కొత్త మలుపు శ్రీపతికి సుఖంగా వుంది.

జయ : ఆకలి కేకల్నుంచి అంతస్థు ఎక్కింది కామేశ్వరమ్మ కోడలయింది. ప్రాథమిక సమస్యలకి యిక సెలవు. డబ్బు, నగలు అనుభవంలోకి వచ్చాయి. 'సుఖపడ్డాను' అనుకుంది పెళ్ళిరోజున. 'సుఖపడాలి' అనుకుంది మర్నాడు. 'ఇది సుఖమా ?' అని వెలవెలపోయింది తర్వాత. అందని సుఖాలని మరచిపోయి అందినవాటితో తృప్తిపడటం నేర్చుకుంది.

నలుగురికి మేలు జరిగే పనిలో నైతికంగా తప్పున్నా 'త్యాగం' ముసుగులో ఒప్పుగా చలామణీ అయి పోతుంది. స్వార్థాల నివృత్తి సరిసమానంగా వుండే మమకారాలు మరింత వికసిస్తాయి.

పున్నమిరోజు.

జగమంతా వెన్నెలతో తడిసి పోతున్నది. ప్రకృతి చందమామ కాంతుల్లో వింతగా మెరిసిపోతున్నది. శ్రీపతి డాబామీద ఫోంబెడ్ మీద పడుకుని వెండిజరీలా మెరిసిపోతున్న గోదావరి అందాలని గమనిస్తున్నాడు.

"ఇదిగో మందు తీసుకోండి." జయ తట్టి పిలిచింది.

శ్రీపతి త్రుళ్ళిపడ్డాడు.

జయ మందుగ్లాసు నోటిదగ్గర పెట్టింది.

భార్య జడలోని మల్లెల సువాసన పీలుస్తూ "ఎప్పుడూ మందేనా ?" అన్నాడు.

"త్రాగాల్సిందే..." జయ ప్రక్కన కూర్చుని మందు నోట్లో పోసింది.

"ఈ చేదుమందు త్రాగినందుకు తియ్యటి ముద్దు యివ్వాల్సిందే."

"లంచాల్ని రద్దుచేశాం."

"లాభంలేదు." శ్రీపతి ఆమెని మీదకి లాక్కున్నాడు. వెన్నెలలోని ఏకాంతం కోరికల్ని రెచ్చగొడుతోంది. మెత్తటి జయ స్పర్శ అనుభూతి రేపుతోంది శ్రీపతిలో.

జయ విడిపించుకుని కుర్చీలో కూర్చుంది. ఆపిల్ తీసి ముక్కలు చేస్తూ "రోజుకి రెండు పళ్ళు తినమన్నాడు డాక్టరు. మీరు ఒక్కటి గూడ తినడంలేదు" అంది నిష్టూరంగా.

"నేను పుట్టినప్పట్నుంచి వాటిని తింటూనే వున్నాను." శ్రీపతి ఆమెకేసి వంగాడు.

"మీరు బుద్ధిగా కూర్చోకపోతే క్రిందకి వెళ్ళిపోతాను."

"ప్లీజ్ జయా..." ఆమె చేతిలోని చాకు అందుకున్నాడు. స్టీలు చాకు పదును వెన్నెలలో మెరిసిపోతున్నది. ఈ చాకుని దూరంగా చూసి సంతోషించవల్సిందే. ముద్దుపెట్టుకుంటే మూతి తెగుతుంది. శ్రీపతి భారంగా నిట్టూర్పు విడిచాడు.

"ఎన్నాళ్ళు జయా......"

సమాధానం ఆమె కేం తెలుసు !

కాలం చెప్పాల్సిందే.

"ప్రొద్దుపోయింది, పడుకోండి."

మమతాబద్ధమైన ఆజ్ఞ ధిక్కరించలేక పోయాడు. జయ దుప్పటి కప్పింది నిండుగా. జయ లాలింపుతో అతడికి నిద్ర ముంచుకువచ్చింది.

జయ ఒంటరిగా మిగిలిపోయింది. వెన్నెలక్రింద. వెన్నెలలోని ఏకాంతంలో తియ్యగా కరిగిపోవల్సిన కాలం బరువుగా నడుస్తోంది.

చేదు మాత్రలా వుంది.

జయకి నిద్రపట్టలేదు.

భర్తకేసి చూసింది. అతడు గాఢంగా నిద్రపోతున్నాడు. జయ మనసునిండా అశాంతి వెన్నెలకి పరవశించిన యవ్వనం అలజడి చేస్తోంది. జడలోనుంచి రాలిన పూల దండని విసుగ్గా కాలితో నలిపేసింది.

పిట్టగోడ దగ్గరికి వెళ్ళి నిలబడింది.

ఊరు నిశ్శబ్దంలో నిద్రపోతోంది. ఎక్కడ్నుంచో బ్యాండు వాయిద్యం వినిపిస్తోంది. వెన్నెలరాత్రిలో ఆ వాయిద్యం మధుర తరంగాలు లేపుతోంది.

దాహం వేస్తోంది తనకి. కాని దగ్గరలోఉన్నవి ఉప్పునీళ్ళు. అన్వేషించే

స్వాతంత్ర్యాన్ని సాంఘిక శక్తులు అడ్డగిస్తున్నాయి వివాహ బంధం చుట్టూరా పంజరంలా వుంది. ప్రాప్తించినదే పంచామృత మనుకోవాలి. నిశ్శబ్దమైన వాతావరణంలో తను ఏకాకినన్న భావం కలిగింది. శిధిలమైన కోటలో ఒంటరిగా నిల్చున్న భ్రాంతి. అర్ధరాత్రి ఒంటరిగా అడవిలోవున్న భయం.

అడవికాచిన వెన్నెల తన జీవితం.

శ్రీపతి కెవ్వున అరిచాడు. జయ దగ్గరకి పరుగెత్తింది. శ్రీపతికి ఫిట్ వచ్చింది. జయ క్రిందకివెళ్ళి పతంజలిని, కామేశ్వరమ్మని పిలుచుకువచ్చింది.

ఇల్లంతా హడావిడి

డాక్టరు వచ్చాడు. మందులు గుప్పించాడు. శ్రీపతికి తెలివి వచ్చింది. కాని అది తాత్కాలికం మళ్ళీ వుధృతంగా ఫిట్ వచ్చింది.

ఆ రాత్రి అందరికీ శివరాత్రి అయింది.

కామేశ్వరమ్మ దడతో భయపడిపోయింది.

పెళ్ళివల్ల రోగం ఎక్కువయిందా ?

తెల్లవారిన తర్వాత శ్రీపతికి రిలీఫ్ యిచ్చింది. కాఫీ త్రాగి లేచి కూర్చున్నాడు. అందరి మనసులు శాంతించాయి.

డాక్టరు మళ్ళీ వస్తానని బయలుదేరాడు.

కామేశ్వరమ్మ, పతంజలి ఆయన వెంట బయటికి వచ్చారు చిన్నప్పటి నుంచి ఆయనే శ్రీపతికి వైద్యం చేస్తున్నాడు. ఆయన హస్తవాసిమీద కామేశ్వరమ్మకి నమ్మకముంది.

"ఏం భయంలేదు కదూ......?" కామేశ్వరమ్మ ఆత్రంగా అడిగింది.

"మందులు వేసి అపుతామమ్మా. కాని అది పద్ధతి కాదు. ప్రకృతి వైద్యం వల్ల పూర్తిగా నయమవుతుంది. ఈ మధ్య యిద్దరికి అలాగే తగ్గింది."

కామేశ్వరమ్మలో ఆశా దీపం వెలిగింది. "అన్నిటికీ మీదే భారం డాక్టరుగారూ "

"ఏం భయం లేదమ్మా. పతంజలి గారూ .... తొమ్మిది గంటలకు వచ్చినప్పుడు మీకు ఆ డాక్టరు ఎడ్రస్ ఇస్తాను. ముందర వెళ్ళి తెలుసుకు రండి. తర్వాత ఆ బ్బాయి ని తీసుకెళదాం."

"అదీ చూద్దాం."

డాక్టరు వెళ్ళాక కామేశ్వరమ్మ దిగాలుగా కూర్చుండిపోయింది. రాత్రి హడావిడితో కొడుకు అందదేమోనన్న భయం పట్టుకుంది. ఆందోళనతో ముఖం నల్లబడిపోయింది.

"సరి సరి...నువ్వు కూడా యిలా గయితే ఎలా ? జయ వసారాలో ఏడుస్తూ కూర్చొంది. ఆ పిల్లకి కాస్త ధైర్యం చెప్పు." భార్యని మందలించాడు పతంజలి.

పతంజలి ఆరోజే వెళ్ళి ప్రకృతి వైద్యం గురించి తెలుసుకువచ్చాడు.

"తగ్గుతుందన్నారా ?" ఆరాటంగా కామేశ్వరమ్మ అడిగింది.

"ఆ కనీసం మూడునెలలు అక్కడ ఉండాలిట. వెంటనే తీసుకురమ్మన్నారు"

తర్వాత శ్రీపతితో ఎవరు వెళ్లాలన్నది ప్రశ్నయింది. కామేశ్వరమ్మ తను వెళతానంది. జయ తానే వెళతానంది.

"మీ అత్తయ్య వెళుతుందిలేమ్మా. నీ వక్కడ సమర్థించలేవు."

పతంజలి మాటతో జయ ఆగిపోయింది.

మర్నాడు మధ్యాహ్నం ప్రయాణం. పతంజలి ప్రయాణం ఏర్పాట్లు చేశాడు. జయ రావడంలేదని తెలిసి శ్రీపతి ఖిన్నుడయ్యాడు

మూడునెలలు జయకి దూరంగా వుండటమా ? జయని కూడా తీసుకు రమ్మని తల్లితో చెప్పాడు.

"అప్పుడే పెళ్ళాం బెల్లం అయిందిరా ?" కామేశ్వరమ్మ నవ్వింది.

శ్రీపతి సిగ్గుతో జయ దగ్గరికి పారిపోయాడు.

"నువ్వు రావూ జయా ?" బట్టలు సర్దుతున ఆమెవైపు వెనకగా వెళ్ళి భుజాలు పట్టి మార్దవంగా అడిగాడు.

జయ బాధని దిగమ్రింగుకుంటూ నవ్వింది. "మీరు నా మాట వింటారూ ?"

"ఎందుకు వినను ... సరస్వతీదేవి తోడు......"

జయ బిగ్గరగా నవ్వింది.

"నీ కసలు రావాలనిలేదు." కోపం నటించాడు.

"మామయ్యగారి ఆజ్ఞ అది. ముందర మీ అమ్మగారిని రానివ్వండి. తర్వాత నేను వస్తాను."

"నిజం ?"

"రెండ్రోజులకైనా ఉత్తరం రాస్తూండాలి సుమా."

జయ అంగీకరించింది.

బయటి నుంచి పతంజలి కేక వినిపించింది.

రెండు నెలలు గడిచిపోయాయి. శ్రీపతి ఆరోగ్యం క్రమంగా బాగుపడుతోంది. వారానికి రెండుసార్లు పతంజలి వెళ్ళి చూసివచ్చేవాడు. జయ కూడా నాలుగయిదుసార్లు వెళ్ళింది.

"వాడు వచ్చేదాకా మీ నాన్నగారి దగ్గరికి వెళితే వెళ్ళమ్మా."

పతంజలి చెప్పినా జయ ఇష్టపడలేదు. శ్రీపతి ఇంటికి రాకుండా ఆమెకి ఎక్కడికీ వెళ్ళాలనిలేదు. భర్త అనారోగ్యం సంగతి మాత్రం తండ్రికి తెలియపరిచింది.

సుబ్బారాయుడు చూసి వెళ్ళాడు.

పతంజలికి 'కోర్టు' పని ద్వారా ఎప్పుడూ బిజీగానే ఉంటాడు. పుస్తకాలు, రేడియో జయకి కాలక్షేప సాధనా

అయినాయి. నాలుగుగోడల మధ్య ఒంటరిగా కాలక్షేపం చెయ్యడంవిసుగ్గానే వుంది. ఏదయినా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొందామంటే అదేమంత ఎదిగిన పట్టణం కాదు.

ఈ పరిస్థితిలో వచ్చాడు మన్మథరావు, సుబ్బమ్మ కొడుకు. ఆతడు మిలట్రీలో పనిచేస్తున్నాడు. సెలవుమీద వచ్చాడు.

మన్మథరావు మంచి వక్త. ఎదుటి వార్ని కదలనివ్వకుండా మాట్లాడగలడు

జయ కాస్త రిలీఫ్‌గా వుంది.

శ్రీపతిని ఇంటికి తీసుకురావడానికి పతంజలి వెళ్ళాడు

రెండురోజులయినాపతంజలి రాలేదు. భర్తకి ఏమయిందో ...... జయకి ఆందోళన

"మీరు త్త కంగారు మనిషిలా వున్నారు శ్రీపతికి రికేం కాదు. మీరు

అనవసరంగా భయపడకండి. శ్రీధరుగారు ఏంపనిమీద తిరుగుతున్నారో?" మన్మధ రావు ధైర్యం చెప్పాడు.

"అంతే నంటారా ?"

"ఇంకా సంశయమా ?"

"పోనీ శ్రీధరుగారు వైర్ యివ్వచ్చు కదా ?"

"ఆయన కేసుల్లో పడితే మనం గుర్తుండమండీ."

ఆ రాత్రి భో జ నా లయ్యా క మన్మధరావు హాల్లో కూర్చుని వీణ వాయిస్తున్నాడు. జయ ఆసక్తిగా వింటోంది

కాస్సేపు కూర్చుని నల్లమందు వేసుకుని సుబ్బమ్మ నిద్రకి లేచింది.

అర్థరాత్రయింది.

"మీరు బాల బాగా వాయిస్తారు." జయ మెచ్చుకుంది.

"మునగచెట్టు ఎక్కించకండి"

జయ కోరికమీద మరో గంట వాయించాడు.

ఒంటిగంటయింది.

కరెంటు పోయింది.

"మీరు పడుకోండి...నే వస్తాను." మన్మధరావు లేచాడు.

"దీపాలు రానివ్వండి ... వెళుదురు గాని." జయ కొవ్వొత్తి వెలిగించింది. ఆ చిరుచీకటి ఆమెకి భయంగా వుంది.

మన్మధరావు వేరేవిధంగా అర్థం చేసుకున్నాడు. ఆడది అంతకంటె ఏం చెబుతుంది ? ఈ రకం వేటలో తను ఎంతమందిని చూడలేదు ?

జయ దగ్గరగా సోఫాలో కూర్చున్నాడు. మీదకి వంగి పెదాలు కొరికాడు. ఆమె నివ్వెరపోయింది. లేవబోయింది. మన్మధరావు కౌగిలి బిగించాడు.

"వదలండి...ఏం పనిది..." జయ పెనుగులాడింది.

మన్మధరావు అసహ్యంగా నవ్వాడు. "ఏం పనో చెబుదామనే."

జయ కేకలు వేసింది. పనివాళ్ళు సినిమాకి పోయారు. సుబ్బమ్మకి మెలకువరాదు. మన్మధరావుది పైచెయ్యి అయింది.

చీర లాగేశాడు కసిగా.

"ప్లీజ్, నన్ను వదలండి." సంప్రదాయం యొక్క తిరుగుబాటిది.

"ఎందుకు చెబుతున్నానో వినరేం?" యవ్వనంయొక్క తొందరపాటిది.

మన్మధరావు ఆవేశంలో ఏమీ లెక్క చేయలేదు. ఆమెని పూర్తిగా ఆక్రమించాడు. ముద్దులతో ఆమె శరీరాన్ని నింపేశాడు.

ఇక జయ ప్రతిఘటించలేక పోయింది.

శరీరం కోరికల కోసం కలవరిస్తూంది.

రోగి పాలే కోరాడు. వైద్యుడూ పాలే యిచ్చాడు.

ఇంతలో దీపాలు వెలిగాయి. దీపాలతో పతంజలి లోపలికి వచ్చాడు. ఆ స్థితిలో వారిద్దరినీ చూడగానే స్థంభించిపోయాడు.

"జ.........యా"

మన్మథరావు పారిపోయాడు. జయ ఏడుస్తూ వుంది. పతంజలి ఏమీ అనలేదు కేక లెయ్యలేదు.

సీరియస్‌గా పచార్లు చెయ్యసాగాడు.

ఆ మౌనం జయని మరింత క్షోభ పడేస్తోంది.

పతంజలి మేడపైకి వెళుతూ "కుక్కని సింహాసనం ఎక్కించినంత మాత్రాన దాని వెధవగుణం ఎక్కడికి పోతుంది ?" అని మాత్రం అన్నాడు.

జయ మూగబోయింది.

* * *

జరిగినది వెంటనే కొడుక్కి ఉత్తరం రాశాడు. పోస్టు చేశాడు.

పతంజలి ఆలోచనల్నుంచి తేరుకున్నాడు. వర్షం వెలిసింది. ఎండ వచ్చింది. వానమీద ఎండ బంగారంలా మెరిసిపోతున్నది. పతంజలి ఉత్తరాన్ని జేబులో పెట్టుకున్నాడు.

వాచీ ఐదు చూపిస్తోంది. తోటలోకి నడిచాడు. వానకి నేలంతా తేమగా వుంది. వర్షబిందువులు ఎండలో మెరుస్తున్నాయి. గాలికి చెట్లు జల్లుగా చినుకులు రాలుస్తున్నాయి

పతంజలి కాలక్షేపంగా తిరుగుతున్నాడు. కాని మనస్సు తీవ్రంగా ఆలోచిస్తున్నది. కర్తవ్యం ఎదురుగా వుంది. తను ఒక నిర్ణయం తీసుకునే సమయం ఆసన్నమయింది.

అటా ? ఇటా ? అని ఒకర్ని సలహా అడిగే పరిస్థితి కాదు. పూర్వాపరాలు ఆలోచించుకుని తనే నిర్ణయానికి రావాలి. తనే న్యాయాధిపతి న్యాయమూర్తి. సాక్షి.

దైవకృపవల్ల శ్రీపతి మనిషి అయ్యాడు. ఆరోగ్యవంతుడయ్యాడు. ఇక వాడు నిశ్చింతగా జీవితాన్ని అనుభవించగలడు. సంసారాన్ని నడిపించగలడు

బాధ్యతలనుంచి తను రిటైర్ కావచ్చు

ఈ పరిస్థితిలో సర్వస్వం జయేనని భావిస్తూ ఆమెమీద మమతల హరివిల్లు నిర్మించుకున్న శ్రీపతి నిజం తెలుసుకుంటే గిలగిలలాడిపోతాడు. జయ తప్పుచేసింది. వయసు దాన్ని చేయించి వుండవచ్చును. కాని వంశ గౌరవానికి మచ్చ వచ్చింది. ఆమె తప్పుకి తను ఏకైక సాక్షి.

జయ తప్పు వాడికి తెలిస్తే ???

మొదటి దృశ్యం :

శ్రీపతి వచ్చి పదిరోజులయింది. కామేశ్వరమ్మ కొడుకు – కోడలుచేత సత్యనారాయణ వ్రతం చేయించింది. చుట్టాలు, స్నేహితులు వచ్చి శుభాకాంక్ష

లందించారు. ఇంత జరుగుతున్నా పతంజలికో ఆనందంలేదు. దూరపు చుట్టంలా మసిలాడు. తనకేం బాధ్యత లేనట్లు నిర్లిప్తంగా కూర్చున్నాడు.

భర్త మరబొమ్మలా తిరగడం కామేశ్వరమ్మ గ్రహించింది.

"ఏమిటలా వున్నారు ?" నిగ్గతీసి అడిగింది.

"ఏంలేదు."

ముభావంగా ఊరుకున్నాడు. కామేశ్వరమ్మకి చెబితే తన బాధ సగం తీరుతుంది. కాని ఆమె ఆవేశపరురాలు. ఏం జరుగుతుందో ?

రోజులు గడుస్తున్నా భర్తలో మార్పు రాకపోవడం కామేశ్వరమ్మకి ఆందోళన రేపింది శ్రీపతి రోగం తగ్గి ఇంటికి వచ్చినందుకు ఎంత హడావిడి చేస్తారో ననుకుంది. ఇంటిదగ్గర చాల సీరియస్‌గా వుంటున్నారు. యాంత్రికంగా కోర్టుకి పోయివస్తున్నారు.

విషయాన్నిరాబట్టాలని ప్రయత్నించి విఫలురాలైంది.

"ఏమయిందే మీ మామగారికి ?" కోడల్ని అడిగింది.

జయ కూడ మూగనోము పట్టింది.

ఇంట్లో మార్పు శ్రీపతి పై ప్రభావాన్ని చూపించింది.

ఓరోజు రాత్రి భోజనాలయ్యాక పేపరుకోసం శ్రీపతి తండ్రి గదిలోకి వెళ్ళాడు. పతంజలి ఒక్కడూ విస్కీ త్రాగుతున్నాడు. శ్రీపతికి అది తెలిసినవిషయమే కనుక పేపరు తీసుకుని వెళ్ళబోతూండగా" కమాన్ మై బాయ్" అని కేకవేశాడు.

శ్రీపతి దగ్గరగా పోయి కూర్చున్నాడు. సిగరెట్ వెలిగిస్తూ "నీ భార్య ఎలా వుంటోంది ?" సూటిగా అడిగాడు.

"చాల వల్‌గా వుంటుంది."

"అంటే భయపడుతోంది మాట"

"దేనికి ?"

పతంజలి చెప్పెయ్యడానికి నిశ్చయించుకున్నాడు. ఆ రహస్యాన్ని ఇక తను దాచలేడు. తనవల్లకాదు. శ్రీపతిని మోసం చెయ్యలేడు.

జయ చేసిన తప్పు తెలియజేశాడు.

"అబద్ధం" శ్రీపతి గట్టిగా అరిచాడు.

"కాదు నిజం."

"దాన్నే అడుగు ... మన్మథరావుని అడుగు........."

శ్రీపతి పరుగు తీశాడు.

కాస్సేపట్లో కామేశ్వరమ్మ కంగారుగా అక్కడికి వచ్చింది. "దాన్ని చంపేస్తున్నాడండోయ్ ?"

పతంజలి భార్యతో కొడుకు గదిలోకి వెళ్ళాడు.

శ్రీపతి హంటర్‌తో భార్యని కొడుతున్నాడు. జయ శరీరం రక్తసిక్తమై పోయింది. పతంజలి విడిపించాడు.

"ఏం జరిగిందంటే మాట్లాడవేం?" కామేశ్వరమ్మ గద్దించింది.

"ఇంటిని సానికొంప చేసింది."

తెల్లారేసరికి జయ శరీరం నూతిలో తేలింది. సంసారం రోడ్డు ఎక్కింది. ఈ షాక్‌తో శ్రీపతి పిచ్చివాడయ్యాడు.

రెండో దృశ్యం:

"పిల్చారా?" జయ మెల్లగా లోపలికి వచ్చింది.

పతంజలి పదార్లు చేస్తున్నాడు. జయను చూసి "శ్రీపతీ మీ అత్తయ్యా రేపుదయం వస్తున్నారు," అని చెప్పాడు.

జయ తల పైకెత్తలేదు పతంజలితో మాట్లాడడానికే భయంగా వుంది.

"మాట్లాడవేం?"

"రేపు నేను వెళ్ళిపోతాను. ఈ పాపిష్టి ముఖాన్ని వారికి చూపించలేను." జయ ఏడుస్తోంది వెక్కి వెక్కి.

"నీ నిర్ణయం నాకు అర్థంకావడం లేదు. ఇది నీ యిల్లు. ఇక్కడ్నుంచి పారిపోతానంటావేమిటి? గమ్యం లేకుండా బయలుదేరితే అగమ్య మవుతుంది బ్రతుకు ఏ పరిస్థితిలో ఆ తప్పు జరిగిందో నాకు తెలియదు కాని నీ సహకారం మాత్రం వుంది"

జయ మాట్లాడలేదు ఆదంతా పీడ కలలా కనిపిస్తోంది. మన్మధరావుని ఆగమనడమే తను చేసిన తప్పు. అది యింత అనర్థానికి దారితీసింది. మన్మధరావు తనని దోపిడీ చెయ్యబోయాడు.

"శ్రీపతి నిన్ను ఎంత ప్రేమిస్తున్నాడో నాకు తెలుసు. వాడు నీతోటే జీవితమనుకుంటున్నాడు పునర్జీవుడై వచ్చేవేళ నువ్వు లేకుండా పోతే వాడి భవిష్యత్తు శూన్యమైపోతుంది."

"ఆ పరిస్థితి ఎలా ఏర్పడిందో చెప్పలేను....కాని నా మనస్సులో మీ కుటుంబానికి కళంకం తెచ్చే తలంపు లేదు." ఏడుపు ఆపి స్థిరంగా అంది.

పతంజల్లో ఆ మాటలు మార్మోగాయి

విద్య తప్పు చేసింది. అశోక్‌తో పల్లిగ్గా లాడ్జికు తిరిగింది. దాన్ని మరుగుపరచి పెళ్ళి చేశారు. అదే తప్పు జయ చేసింది.

తను క్షమించి తీరాలి.

"జరిగింది మరిచిపో జయా! దాన్ని పునరావృతం కానీయకు. ఇది నా ప్రార్థన ఈ కుటుంబానికి నీ ద్వారా వెలుగు రావాలి. ఈ రహస్యం మనిద్దరి మధ్య వుండిపోతుంది"

"అంత అదృష్టమా?"

"ఇది అవకాశం. నిలుపుకుంటే అదృష్టమవుతుంది."

జయ వంగి పాదాభివందనం చేసింది. "ఏ మాట నిలబెడతానని ప్రమాణం చేస్తున్నాను."

"మనస్సాక్షిగా చెప్పు చాలు. శ్రీపతికి నీ మీద వుండే అభిమానానికి రాణీ పడుతున్నాను ఒక తప్పు చేస్తే జీవి

కొంతం శిక్ష అనుభవించకూడదని నీ కీ అవకాశం యిస్తున్నాను. నీ మీద పెంచుకున్న విశ్వాసం వమ్ము కాకూడదు...వెళ్ళు...''

తెల్లవారేసరికి కామేశ్వరమ్మ, శ్రీపతి టాక్సీ దిగారు. జయ పారాణి నీళ్ళతో ఎదురు వచ్చింది. మందార రంగు పట్టు చీరలో ఉషాసుందరిలా కన్పించింది జయ. భార్యని చాటుగా పిల్చి ముద్దు పెట్టుకున్నాడు.

"వదలండి...మీ అమ్మగారు...''

''నీ గురించి ఆలోచించని క్షణం లేదు జయా...'' ఆమెని మరింతగా హత్తుకున్నాడు.

జయ, శ్రీపతి ఆనందంగా వుండటం కామేశ్వరమ్మకి ఏనుగు నెక్కినట్లయింది. ఇక శ్రీపతి జీవితం తమకి సమస్య కాదు.

''జయ వచ్చిన వేళ మంచిదండీ. అబ్బాయి మనిషయ్యాడు.''

''అవును కామేశ్వరీ!''

* * *

తిరిగి వర్షపు జల్లు ప్రారంభమైంది. పతంజలి తోటనుంచి యింట్లోకి పరుగు తీసాడు, హాల్లో జయ...విద్య కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. పతంజలి వార్ని పలకరించకుండా మేడ ఎక్కాడు.

రెండు దృశ్యాలలో తానేది ఎన్ను కోవాలి? కుంచె తన చేతిలో వుంది. తన యిష్టమైన బొమ్మను గీసుకోవచ్చు.

మొదటి దృశ్యం రావాలంటే ఉత్తరం పోస్టు చెయ్యాలి. అది ట్రాజడీకే దారి తీస్తుంది.

రెండవ దృశ్యం ఏర్పడాలంటే ఉత్తరం చింపివేయాలి

అలా చేస్తే కుటుంబంలో శాంతి, సంతోషం కనిపిస్తాయి.

పతంజలి చుట్ట నోట్లో పెట్టుకుని లైటర్ తో వెలిగించాడు.

చివర్న ఉత్తరాన్ని అంటించాడు.

ఇప్పుడతని మనస్సు ప్రశాంతంగా వుంది.

పతంజలి మేడ దిగివచ్చాడు క్రిందకి.

(సమాప్తం)